సాక్షి
అన్నమయ్య జిల్లా

శనివారం ♦ 29 ♦ జూన్ ♦ 2024



కట్టుకున్న భర్తే కాలయముడు!

కట్టుకున్న భర్తే భార్య పాలిట కాలయముడయ్యాడు. భార్య మరొకరితో సన్నిహితంగా ఉందనే కారణంతో కక్ష పెంచుకుని హత్య చేశాడని పోలీసులు భావిస్తున్నారు. -8లో



ఈ-సెట్ కౌన్సెలింగ్ షురూ ..

ఈ-సెట్ ఫలితాలు ఇటీవల విడుదలయ్యాయి. ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్ ప్రక్రియ షురూ అయింది. జులై 8న సీట్లను కేటాయిస్తారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్ఠం	గరిష్ఠం
మొదటిరకం	రూ.480	రూ.560
రెండోరకం	రూ.330	రూ.460



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 927 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్ఠం	గరిష్ఠం
బైవోల్టిన్	460	465
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 261.280 కిలోలు

న్యూస్‌రీల్

నేడు జాతీయ లోక్ అదాలత్

కడప అర్బన్: వైఎస్సార్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శనివారం ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ×జాతీయ లోక్ అదాలత్‌¥ నిర్వహించనున్నారు. జిల్లా వ్యాప్తంగా 22 బెంచీలు ఏర్పాటు చేశారు. కడపలో 6 బెంచీలు, ప్రొద్దుటూరు 4, రాజంపేట 1, రాయచోటి 4, బద్వేల్ 2, పులివెందుల, కమలాపురం, జమ్మలమడుగు, లక్కిరెడ్డిపల్లె, మైదుకూరులలో ఒక్కో బెంచీని ఏర్పాటు చేశారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌ను జయప్రదం చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జి. శ్రీదేవి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

హుండీ ఆదాయం లెక్కింపు



వీరభద్రస్వామి ఆలయ హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

రాయచోటి టౌన్: రాయచోటి శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయ హుండీల ఆదాయాన్ని లెక్కించారు. ఈ లెక్కింపు ద్వారా మొత్తం రూ.21,32,855 వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. శ్రీ వీరభద్రస్వామి, శ్రీ భద్రకాళీ అమ్మవారు, శివాలయం, గణపతి ఆలయ హుండీల ఆదాయాన్ని లెక్కించారు ఈ మొత్తం 90 రోజులకు వచ్చిన ఆదాయమని ఆలయ అధికారులు తెలిపారు. వీటితో పాటు 35.600 కిలలో వెండి, 1.856 కిలలో బంగారు బంగారు ఆభరణాలు వచ్చాయన్నారు. నిత్యాన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాటు చేసిన హుండీని కూడా లెక్కించగా 1.04,290లు వచ్చిందని చెప్పారు. ఈ మొత్తం రాయచోటి స్టేట్ బ్యాంక్‌లో జమ చేసినట్లు ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి తెలిపారు.దేవదాయశాఖ తనిఖీ అధికారి జనార్దన్, శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు, బ్యాంక్ సిబ్బంది, ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జూలై 10 నుంచి జూనియర్ హాకీ పోటీలు



పులివెందుల రూరల్: జూలై 10 నుంచి 18 వరకు సెకండ్ సౌత్ ఇండియన్ నేషనల్ జూనియర్ చాంపియన్ షిప్ హాకీ క్రీడలు పులివెందులలో నిర్వహిస్తు న్నట్లు ఆంధ్ర ప్రదేశ్ హాకీ అకాడమి ప్రెసిడెంట్ చాణిక్యరాజ్, సీఈఓ నిరంజన్ రెడ్డిలు తెలిపారు. శుక్రవారం పులివెందుల పట్టణంలోని వైఎస్సార్ క్రీడామైదానంలోని వసతులను, మైదానాన్ని వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సౌత్ ఇండియన్ నేషనల్ చాంపియన్ హాకీ క్రీడాపోటీలకు 6 రాష్ట్రాల నుంచి బాలురు, బాలికలు హాజరౌతున్నారన్నారు. క్రీడాకారులకు కావాల్సిన అన్ని మౌళిక సదుపాయాలతో పాటు అన్ని వసతులు కల్పిస్తామన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రెజరర్ థామస్ పీటర్, అడ్వైజర్ శ్రీనివాసులు, జిల్లా ప్రెసిడెంట్ రవిచంద్ర, సెక్రటరి శేఖర్, సీనియర్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

సరుకుల సరఫరాలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



బియ్యం బస్తాల తూకాలను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

లక్కిరెడ్డిపల్లి: నిత్యావసర సరకులను చౌక దుకాణాలకు సరఫరా చేయడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ పేర్కొన్నారు మండల కేంద్రంలోని పౌరసరఫరాల గోదామును శుక్రవారం జాయింట్ కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోదాము నిర్వహణలో అవకతవకలకు పాల్పడినా, ఉదాసీనంగా వ్యవహరించినా చర్యలు తప్పవని గోదాము అధికారి మల్లికార్జున బాబును హెచ్చరించారు. గోదాములోని స్టాకు రిజిస్టర్, సరుకుల దిగుమతి దస్త్రాలను పరిశీలించారు.చౌక దుకాణాలకు పంపించే బియ్యాన్ని తప్పనిసరిగా తూకం వేయాలన్నారు. అనంతరం తూకాలు వేసే పరికరాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లె తహసీల్దార్ కుమారస్వామి, ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ ఉస్మాన్ సాహెబ్, ఆర్‌ఐ సమ్మత్ ఖాన్, గోదాము సిబ్బంది పాల్గొన్నారు.

ఆగిన వెబ్‌సైట్.. చెల్లింపులకు బ్రేక్

- నిలిచిపోయిన గృహ నిర్మాణాలు!
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇళ్ల నిర్మాణాలకు రూ.838.81 కోట్ల చెల్లింపులు
- సిమెంట్ లెక్కలు సరి చేసే పనిలో అధికారులు?



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇచ్చిన మెటీరియల్ (ఫైల్)



పెద్దతిప్పసముద్రంలో అసంపూర్తి ఇళ్ల నిర్మాణాలు

జిల్లాలో 3వ తేదీ నాటికి ఇళ్ల నిర్మాణ స్థితి

- చేపట్టిన ఇళ్ల నిర్మాణాలు: 75,619
- ప్రారంభంకానివి: 1,123
- బిలో బేస్‌మెంట్ లెవల్: 9,748
- ప్లింత్‌భీం: 349
- బేస్‌మెంట్ లెవల్: 19,578
- లింటిల్ లెవల్: 856
- రూఫ్ లెవల్: 6,151
- రూఫ్‌కాస్ట్: 4,745
- పూర్తయినవి: 33,069
- చెల్లించిన బిల్లులు: రూ.720,64,13,861
- మెటీరియల్ విలువ: రూ.116,60,00,609
- మొత్తం ఖర్చు: రూ.838,81,30,102



బి.కొత్తకోట: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ నిర్వహణలోని గృహ నిర్మాణ శాఖ వెబ్‌సైట్‌ను ప్రస్తుత ప్రభుత్వం పూర్తి స్థాయిలో మార్పులు చేపట్టడంతో జిల్లాలో ఇళ్లు నిర్మించుకొంటున్న పేదల ఇళ్ల నిర్మాణ స్థాయి, బిల్లుల చెల్లింపునకు బ్రేక్ పడింది. దీనితో పేదలు తాము నిర్మించు కుంటున్న ఇళ్ల నిర్మాణాలకు బిల్లులు చెల్లిస్తే పనులు పూర్తి చేయించుకుంటామని లబ్ధిదారులు అంటున్నారు. కొత్తగా కొలువైన టీడీపీ కూటమి ప్రభుత్వం గృహనిర్మాణాలపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో ఇంకా సంకేతాలు ఇవ్వలేదు. ప్రభుత్వ ప్రాధాన్యాల్లో గృహ నిర్మాణం ఉంటుందా లేదా అని వేచి చూడాల్సి ఉంది.

గత ప్రభుత్వంలో...

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నవరత్నాలు-పేదలందరికి ఇళ్లు కార్యక్రమం ద్వారా జిల్లాలోని పేదలకు పక్కా గృహాలు మంజూరు చేయగా అందులో 75,619 మంది నిర్మాణాలు చేపట్టేందుకు గృహ నిర్మాణశాఖ రిజిస్ట్రేషన్లు పూర్తి చేసింది. గత ప్రభుత్వాలు ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.1.50 లక్షల లోపు ఇవ్వగా, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఒక్కో ఇంటికి రూ.1.80 లక్షలు అందించింది. ఈ నిధులు తిరిగి ఇవ్వాల్సిన పనిలేదు. రుణం కాకుండా పూర్తి ఉచితంగా ఇచ్చారు. ఇదికాక మహిళా సంఘాల నిధులు, బ్యాంకుల ద్వారా ఒక్కో లబ్ధిదారునికి రూ.35వేల రుణం మంజూరు చేయించారు. దీంతో పేదలు సులువుగా ఇళ్ల నిర్మాణాలు చేసుకునేందుకు వీలు కలిగింది. అలాగే పేదలకు తక్కువ వ్యయంతో నాణ్యమైన ఇంటి సామగ్రిని సరఫరా చేశారు. లబ్ధిదారునికి చెల్లించే యూనిట్ విలువలో ఈ సామగ్రి విలువను మినహాయించుకోవడం జరిగింది. సిమెంట్ కూడా తక్కువ ధరకే అందించారు. ఫలితంగా ఇళ్ల నిర్మాణాలు ఆశాజనకంగా సాగాయి. గత ప్రభుత్వంలో సాగిన ఇళ్ల నిర్మాణాలకు రూ.838 కోట్లు ఖర్చు చేశారు.

పక్కాగా లేని సిమెంటు లెక్క

అధికార యంత్రాంగం మొత్తం అసెంబ్లీ ఎన్నికల నిర్వహణలో మునిగి ఉండగా జిల్లాలోని హౌసింగ్ గోదాముల్లోని సిమెంట్ స్టాక్ తారుమారైనట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదల ఇళ్ల నిర్మాణాలకు సరఫరా చేయగా ఎన్నికల సమయంలో పర్యవేక్షణ ఉండదని లబ్ధిదారుల పేర్లతో తప్పుడు లెక్కలు సృష్టించారని భావిస్తున్నారు. గోదాముకు చేరిన స్టాక్, లబ్ధిదారులకు పంపిణీ, మిగులు స్టాక్ వివరాలపై ఉన్నతాధికారులు చర్యలు చేపట్టినట్టు తెలిసింది. మండలాల్లోని రికార్డులను ఈఈ కార్యాలయాలకు అప్పగించాలని ఆదేశాలొచ్చాయి. ఈ రికార్డుల్లోని వివరాలు, సిమెంట్ స్టాక్ వివరాలను పరిశీలించనున్నట్టు తెలుస్తోంది. జిల్లా స్థాయి అధికారుల పర్యవేక్షలోపంతో సిమెంటు పక్కదారి పట్టి ఉంటుందని అనుమానిస్తున్నారు. ఈ విషయమై జిల్లా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి గృహ నిర్మాణాలకు సంబంధించి, మండలాల్లోని సామగ్రి నిల్వ ఉన్న వివరాలు ఇవ్వాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు. దీంతో అధికారులు సమగ్ర వివరాలను సేకరించే పనిలో పడ్డారు.

వెబ్‌సైట్‌లో మార్పులు

ఈనెల 4న వెలువడిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత గృహనిర్మాణశాఖ కార్యకలాపాలు స్తంభించాయి. గత ప్రభుత్వం వినియోగించిన గృహ నిర్మాణశాఖ వెబ్‌సైట్ లాగిన్‌ను లాక్ చేశారు. దీంతో తన లాగిన్‌ద్వారా ఇంటి నిర్మాణస్థాయిని నమోదు చేసి ఆన్‌లైన్ చేయడం, సంబంధిత పని విలువ బిల్లును అప్‌లోడ్ చేసేందుకు వీలులేకుండా పోయింది. నిర్మాణాలు చేసుకున్న గృహాల వివరాల నమోదుకు ఆస్కారం లేకుండా పోయింది. బిల్లులు చెల్లింపుకు కూడా అవకాశం లేదు. ఫలితంగా లబ్ధిదారులు బిల్లుల కోసం ఎదురుచూస్తున్నారు. తాజాగా హౌసింగ్ వైబ్‌సైట్‌లో మార్పులు చేస్తుండటంతో పూర్తిగా అందుబాటులో లేదు. దీంతో హౌసింగ్ సిబ్బంది, అధికారులు గృహ నిర్మాణాలకు సంబంధించిన వివరాల నమోదు ప్రక్రియను నిలిపివేశారు.

వివరాలు సేకరిస్తున్నాం

జిల్లాలో గృహ నిర్మాణాల కోసం గత ప్రభుత్వం పంపిణీ చేసిన సిమెంట్ ఎంత పంపిణీ చేశారు, ఎంత నిల్వ ఉంది వివరాలు సేకరిస్తున్నాం. హౌసింగ్ లాగిన్‌ను లాక్ చేయడంతో ఇళ్ల నిర్మాణాల వివరాలను నమోదు చేయలేదు. ప్రస్తుత ప్రభుత్వం హౌసింగ్ వైబ్‌సైట్‌లో మార్పులు చేస్తుండటంతో అందుబాటులోకి రాలేదు. వెబ్‌సైట్ అందుబాటులోకి రాగానే సత్వర చర్యలు చేపడతాం.
-శివయ్య, జిల్లా గృహనిర్మాణ శాఖ అధికారి

పీజీ సెట్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రతిభ

రాయచోటి జగదాంబ సెంటర్: ఏపీ పీజీ సెట్ - 2024 ఫలితాల్లోరాయచోటి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనపరించారు. అడ్వాన్స్‌డ్ ఉర్దూ విభాగంలో వరుసగా 1, 4, 8, 11, 15 స్టేట్ ర్యాంకులను సాధించారు. ఎకనామిక్స్ విభాగంలో 3, 10వ రాష్ట్రస్థాయి ర్యాంకులను సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్, విభాగాధిపతులు అభినందించారు. ఉర్దూలో ఎస్.జయనబ్ 1వ ర్యాంకు, పి.మాదిహా 4, ఎస్.ముజఫర్ హుస్సేన్ 4, ఎస్.రుక్సానా 8, ఎస్.టక్కల గౌస్ 11, ఎస్.సమీరా 11, ఎస్.తబస్సుమ్ 15వ ర్యాంకులు సాధించారు. ఎకనామిక్స్ విభాగంలో 3, 10వ ర్యాంకులను ఎస్ఎండీ బాదుల్లా, ఎస్.ఆలియాలు సాధించి సత్తా చాటారు.

ఉచిత నైపుణ్య శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం



పులివెందుల రూరల్: పులివెందులలోని రింగురోడ్డు సమీపంలో ఉన్న నేషనల్ అకాడమి ఆఫ్ కన్‌స్ట్రక్షన్ నైపుణ్యాభివృద్ధి సంస్థలో ఉచిత నైపుణ్య శిక్షణకు దరఖాస్తులు చేసుకోవాలని న్యాక్ అసిస్టెంట్ డైరెక్టర్ రాకేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన కార్యక్రమం ద్వారా ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న మూడు నెలల ఉచిత నైపుణ్య శిక్షణకు దరఖాస్తులు కోరుతున్నామన్నారు. అసిస్టెంట్ సర్వేయర్, ఎలక్ట్రీషియన్, జూనియర్ ఎక్స్‌కవేటర్ ఆపరేటర్, టైలరింగ్, ఎలక్ట్రికల్ వెహికల్ మెయింటెనెన్స్ కోర్సులపై శిక్షణ ఇస్తామన్నారు. 10వ తరగతి ఆ పై చదివిన వారు 18 నుంచి 35 సంవత్సరాలు ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జూలై 9వ తేదీలోపు ఆధార్‌కార్డు, రేషన్ కార్డు, సర్టిఫికెట్లు, రెండు ఫోటోలతో న్యాక్ బిల్డింగ్‌లో హాజరుకావాలన్నారు. వివరాలకు 99851 42155, 98853 31972లను సంప్రదించాలన్నారు.

వాయిదా పడిన రైల్వేటైంటేబుల్

- వచ్చే ఏడాది జనవరి 1న అందుబాటులోకి
- ఉత్తర్వులు జారీ చేసిన రైల్వేబోర్డు



రాజంపేట: రైలుప్రయాణికులకు అవసరమయ్యే రైల్వేటైంటేబుల్ (నూతన రైల్వే సమయసారిణి) పట్టాలు తప్పింది. ఈమేరకు రైల్వేబోర్డు టైంటేబుల్ వాయిదాపై ఉత్తర్వులు జారీచేసింది. భారతీయ రైల్వేలో అన్ని రైళ్ల సమయాలు, రాకపోకలతోపాటు పలు స్టేషన్ల సమగ్ర వివరాలతో రైల్వేటైంటేబుల్‌ను రైల్వేశాఖ రూపొందిస్తుంది. వాటిని ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకొస్తుంది. ఈ విధానం బ్రిటిషు రైల్వేపాలకుల నుంచి ఉండేదని పూర్వీకులు చెబుతున్నారు. ఒకప్పుడు ప్రతి ఒక్కరి వద్ద రైల్వేటైంటేబుల్ కనిపించేది. ప్రస్తుతం ఇది కనమరుగవుతోంది. ఈ క్రమంలో రైల్వేటైంటేబుల్ తీసుకురావడంపై రైల్వేశాఖ ప్రత్యేశ్రద్ధ దృష్టిసారించాలి. పుస్తకమనేది ఎప్పటికీ శాశ్వతమనేది రైల్వేశాఖ గుర్తుంచుకోవాలని రైల్వే కార్మికవర్గాలు అంటున్నాయి. ఆధునాతనమైన సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో వచ్చిన క్రమంలో రైల్వేటైంటేబుల్ ప్రాముఖ్యత కూడా తగ్గుతూ వస్తోంది.

కొత్తగా వచ్చే టైంటేబుల్‌లో..

రైల్వేశాఖ కొత్తగా విడుదల చేసే టైంటేబుల్‌లో నూతన వందేభారత్ ఎక్స్‌ప్రెస్, వందే స్లీపర్, వందే మెట్రో, అమృత్ భారత్ రైళ్ల వివరాలు, సమయాలు, రాకపోకల తేదీలు స్పష్టంగా ఉంటాయి. ప్రత్యేక రైళ్లను రెగ్యులర్ చేయడం, నడుస్తున్న రైళ్లను డిమాండ్ ఉన్న ప్రదేశాలకు పొడిగించడం, రైళ్లు నడుస్తున్న రోజులను పెంచడం లాంటివి టేబుల్‌లో పొందుపరచనున్నారు. రైల్వే వేగాన్ని పెంచడం, కుదించడంలాంటివి కూడా టైంటేబుల్‌లో పొందుపరచనున్నారు. ప్రతి ఏడాది జూల్ 1న సౌత్‌సెంట్రల్ రైల్వే పరిధిలో రైల్వే టైంటేబుల్ ప్రయాణికులకు, అధికారులు, కార్మికులకు అందుబాటులోకి వస్తుంది. అయితే ఈసారి టైంటేబుల్ విడుదలను వాయిదా వేశారు. ఈ మేరకు రైల్వేబోర్డు డైరెక్టరు(కోచింగ్) సంజయ్ ఆర్.నీలం పేరిట ఉత్తర్వులు విడుదలయ్యాయి. ఈ ఉత్తర్వులు ఈనెల 27న జోనల్ రైల్వే అధికారులకు అందాయి.

వచ్చే ఏడాది జనవరి 1 నుంచి..

వచ్చే ఏడాది జనవరి 1 నుంచి నూతన రైల్వే టైంటేబుల్‌ను అందుబాటులోకి తీసుకురానున్నారు. ప్రస్తుతం సెప్టెంబరు 30 వ తేదీ వరకు ఉన్న రైల్వే సమయసారిణి(రైల్వేటైంటేబుల్)ని డిసెంబరు 31 వరకు పొడిగించారు. ఈ ఏడాది పాత రైల్వేటైంటేబుల్‌నే ప్రయాణికులు ఉపయోగించాల్సి ఉంటుంది.

ప్రయాణికులతో మర్యాదగా వ్యవహరించాలి

- ఈడీ గిడుగు వెంకటేశ్వరరావు

కడప కోటిరెడ్డిసర్కిల్: అద్దె బస్సుల్లో డ్రైవర్లు ప్రయాణికుల పట్ల మర్యాద పూర్వకంగా వ్యవహరించాలని ఏపీఎస్ ఆర్టీసీ కడప జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిడుగు వెంకటేశ్వరరావు సూచించారు. శుక్రవారం కడప ఆర్ఎం కార్యాలయ కాన్ఫరెన్స్ హాలులో అద్దె బస్సు డ్రైవర్లకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఈడీ మాట్లాడుతూ ప్రయాణికులు బస్సు ఎక్కేటపుడు, దిగేటపుడు వారికి అన్ని విధాల సహకరించాలన్నారు. ప్రయాణికుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలన్నారు. ప్రయాణికులను గౌరవించినపుడే సంస్థ పట్ల వారికి మంచి అభిప్రాయం కలుగుతుందని తెలిపారు. కొంతమంది డ్రైవర్లు సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తున్నారని, మరోవైపు డ్రైవింగ్ చేస్తూ పొగతాగుతున్నారని.. ఇంకొందరు ర్యాష్ డ్రైవింగ్ చేస్తున్నారని ఫిర్యాదులు వస్తున్నాయని.. ఇది సరైన పద్ధతి కాదన్నారు. జిల్లా ప్రజా రవాణాధికారి గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ డ్రైవర్లు విధి నిర్వహణలో సమయపాలన పాటించాలని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతి డ్రైవర్ డ్యూటీకి వచ్చే సమయంలో తమ కుటుంబ సభ్యులను తలుచుకుంటూ క్షేమకరంగా ఇంటికి చేరుకునేలా విధులు నిర్వర్తించాలన్నారు. కడప డిపో మేనేజర్ డిల్లీశ్వరరావు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ డిపోలకు చెందిన డ్రైవర్లు, అధికారులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు ఆస్పత్రికి ఏ గ్రేడ్

2023-24కు రాష్ట్ర స్థాయి ర్యాంకుల ప్రకటన



జిల్లా ఆస్పత్రి

ప్రొద్దుటూరు క్రైం: ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రికి ఏ గ్రేడ్ దక్కింది. అన్ని విభాగాల్లోనూ మెరుగైన ఫలితాలు సాధించడంతో రాష్ట్ర స్థాయిలో ప్రకటించిన ర్యాంకింగ్‌లో జిల్లా ఆస్పత్రి ఏ గ్రేడ్‌ను దక్కించుకుంది. ప్రభుత్వం హాయ్ (హాస్పిటల్ యాక్టివిటి ఇండికేటర్) ప్రోగ్రాం కింద రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ఆస్పత్రులకు గ్రేడ్‌లను ప్రకటించింది. గతంలో ఆస్పత్రుల పనితీరును బట్టి ప్రతి నెలా గ్రేడ్‌లను ప్రకటించేవారు. అయితే ఈ సారి 2023-24 (2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు) ఆర్థిక సంవత్సరానికి గాను ర్యాంకులను ప్రకటించారు. ఓపీ, ఐపీ, సర్జరీలు, ప్రసవాలు, ఎక్స్‌రే, ఈసీజీ, అల్ట్రాసౌండ్ తదితర విభాగాల్లో సాధించిన ఫలితాల ఆధారంగా గ్రేడ్‌లను ప్రకటిస్తారని ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆనంద్‌బాబు తెలిపారు.

- ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రిలో గత మూడేళ్ల నుంచి ఓపీ, ఐపీతో పాటు అన్ని రకాల శస్త్ర చికిత్సలు కూడా బాగా పెరిగినట్లు గణాంకాల ఆధారంగా తెలుస్తోంది. 2023-24లో జిల్లా ఆస్పత్రిలో ఓపీ- 5,80,685, ఐపీ 64,604, సర్జరీలు 2,552, ప్రసవాలు 2,086, ఎక్స్‌రే 30,780, అల్ట్రా సౌండ్ 12,950, ఈసీజీ 20,529, ల్యాబ్ పరీక్షలు 7,50,292 చేసినట్లు మెడికల్ సూపరింటింటెంట్ తెలిపారు.

అందరి సహకారంతో ఆస్పత్రికి ఏ గ్రేడ్



ఆస్పత్రిలో పని చేసే వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, పారామెడికల్, శానిటేషన్, ల్యాబ్ టెక్నీషియన్స్ ఇతర అన్ని విభాగాల సిబ్బంది సహకారంతో జిల్లా ఆస్పత్రి ఏ గ్రేడ్ సాధించింది. జిల్లా ఆస్పత్రిలో అన్ని రకాల వసతులు ఉన్నాయి. ప్రజలు ప్రభుత్వ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి.
- డాక్టర్ ఆనంద్‌బాబు, జిల్లా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్, ప్రొద్దుటూరు

నేనంటే నేను

- రాజంపేట టీడీపీలో ఇన్‌చార్జి గోల
- ఇన్‌చార్జి ఎవరో తేల్చని అధిష్టానం
- ఎవరికి వారే సమావేశాలు
- షో లీడర్స్‌ను దరిచేయనీయొద్దంటున్న తెలుగుతమ్ముళ్లు



రాజంపేట: అన్నమయ్య జిల్లా రాజంపేట నియోజకవర్గ టీడీపీలో ఇన్‌చార్జి పదవి చిచ్చురేపుతోంది. నేను ఇన్‌చార్జి.. కాదు నేను అనే ధోరణిలో నేతలు వ్యవహరిస్తున్న తీరు ఆ పార్టీ క్యాడర్‌లో గందరగోళంగా మారింది. ఈ విషయాన్ని అధిష్టానం మాత్రం స్పష్టంగా తెలియపరచలేదు. టీడీపీ అధికారంలోకి రాగానే ఇన్‌చార్జి కుర్చీకి డిమాండ్ పెరిగింది. కుర్చీని దక్కించుకునేందుకు పైకి వద్దంటున్నా లోలోపల నేతల ప్రయత్నాలు చేస్తున్నారు. ఎన్నికల్లో ఓటమి పాలైన అభ్యర్థినే ఇన్‌చార్జిగా పెడుతుంటారు. కానీ రాజంపేటలో ఆ విధానానికి బ్రేక్ వేసేందుకు చాపకిందనీరులా ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలో ఎవరికి వారు సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఎన్నికల్లో ఓటమిపాలైన సుగవాసి ఇన్‌చార్జిగా నియోజకవర్గంలో పార్టీ క్యాడర్‌తో సమావేశమవుతున్నారు. మరోవైపు రాష్ట్రంలో టీడీపీ గాలి వీచిన క్రమంలో రాజంపేటలో టీడీపీ ఓటమిని అధిష్టానం జీర్ణించుకోలేకపోతోంది.

బత్యాల..చమర్తి పరిస్థితి ఏమిటో...

గత ఎన్నికల్లో ఓడిపోయిన మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగల్రాయుడు ఐదేళ్లపాటు ఇన్‌చార్జిగా కొనసాగుతూ వచ్చారు. పార్టీ క్యాడర్‌కు అండగా ఉంటూ ఎల్లో పాలిట్రిక్స్ నడిపారు. గత ఎన్నికల్లో రైల్వేకోడూరులో కీలక భూమిక పోషించారు. దీంతో ఆయన రైల్వేకోడూరుకు పరిమితమవుతారా? రాజంపేటకు తిరిగి ఇన్‌చార్జిగా వస్తారా అని ఆయన వర్గం ఎదురుచూస్తోంది. మరోవైపు టికెట్ వస్తుందని భావించిన చమర్తి జగన్‌మోహనరాజు పార్టీ పదవితో సైలెంట్ అయిపోయారు. పార్టీ అధికారంలోకి వచ్చాక ఆయన తనదైన శైలిలో పాలిటిక్స్ చేసుకుంటూ ముందుకు పోతున్నారు. అధికార దర్పం కోసం నేతల పాకులాటతో క్యాడర్ తికమకపడుతున్నారు. ఎన్నికల ముందు పార్టీలో చేరిన మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పోలిసుబ్బారెడ్డి, మేడా విజయశేఖర్‌రెడ్డిలు ఎన్నికల తర్వాత అధికారం అనుభవించేందుకు ఉత్సాహం చూపుతున్నారు.

అధికారగణం తర్జనభర్జన

అధికార పార్టీ ఇన్‌చార్జి ఎవరు తెలియక అధికారులు తర్జన భర్జన పడుతున్నారు. అయినప్పటికీ కొంతమంది అధికారులు ఓడిపోయిన సుగవాసిని కలిసి అభినందనలు, సన్మానాలు చేస్తున్నారు. ఆయన ఇన్‌చార్జి అని చెప్పుకోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. దీనిని జీర్ణించుకోలేని కొంతమంది నేతలు అధిష్టానం ఇంకా ఇన్‌చార్జి ఎవరో చెప్పకముందే అధికారదర్పం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. మరికొందరు మండల, నియోజకవర్గ స్థాయి నేతలు అధికారులపై జులుం ప్రదర్శించడం శ్రుతిమించుతోంది. ఎవరికి వారే ఇన్‌చార్జిలని చెపుకుంటూ అధికారులను తమ గుప్పిట్లో ఉంచుకొనే ప్రయత్నాలు జరుగుతున్నాయి. టీడీడీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అధికారులు, ఉద్యోగులు తలలు పట్టుకుంటున్నారు. ఎవరిమాట వినాలో తెలియక తికమకపడుతున్నారు.

‘షో’ లీడర్స్‌ను దరిచేరనీయకండి..

అధికారపార్టీలో షో లీడర్స్ ఎక్కువయ్యారని వారిని దరిచేయనీయకండి అంటూ ఆత్మీయ సమావేశాల్లో బహిరంగంగానే తమ మనోగతాన్ని క్యాడర్ వ్యక్తం చేస్తున్నారు. రాజంపేట, ఒంటిమిట్ట, సిద్ధవటం, వీరబల్లి, సుండుపల్లె, నందలూరుతోపాటు పలు మండలాలో ఇదే పరిస్థితి. ఐదేళ్లు అధికారాన్ని అనుభవించి, ఇప్పుడు ఇక్కడికి వచ్చి తమపై పెత్తనం చేస్తామంటే ఒప్పుకునేది లేదని అసలుసిసలైన తమ్ముళ్లు తేల్చిచెబుతున్నారు. నియోజకవర్గంలో మూడు గ్రూపులు రన్నింగ్‌లో ఉన్నాయి. ఎన్నికల మందు కలిసిమెలిసి ఉన్నాయి. పార్టీ అధికారంలోకి వచ్చాక మళ్లీ వారి మధ్య ఆధిపత్యపోరు కనిపించింది.

గండి ఆలయ సహాయ కమిషనర్‌గా వెంకటసుబ్బయ్య

చక్రాయపేట: వైఎస్సార్ జిల్లాలోని గండి వీరాంజనేయ స్వామి ఆలయ సహాయ కమిషనర్‌గా వెంకట సుబ్బయ్యను నియమిస్తూ దేవదాయ శాఖ కమిషనర్ సత్యానారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం సహాయ కమిషనర్‌గా పని చేస్తున్న అలవలపాటి ముకుందరెడ్డి తనను మాతృశాఖకు బదిలీ చేయాలని కోరడంతో ఆయనను తక్షణం రిలీవ్ చేసి దేవదాయ శాఖ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు.

క్లుప్తంగా

కారు ధ్వంసం

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలో నివాసముంటున్న ఆర్టీసీ డ్రైవర్ జయరాంకు చెందిన రెనాల్ట్ కారును గుర్తుతెలియని వ్యక్తులు శుక్రవారం ధ్వంసం చేశారు. బాధితుడి కథనం మేరకు.. కారును ఇంటి ఎదుట నిలిపి ఉంచగా కారు ముందు భాగాన్ని గుర్తుతెలియని వ్యక్తులు రాళ్లతో కొట్టి ధ్వంసం చేశారు. ఇంటి బయట ఉన్న ద్విచక్ర వాహనాన్ని విరగ్గొట్టడంతో రూ.40వేల నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపారు. పోలీసులు చర్యలు తీసుకుని న్యాయం చేయాలని అతడు కోరారు.

యువకుడు అదృశ్యం


ఆదాం(ఫైల్)

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలోని బేతేలు చర్చి వీధికి చెందిన ఆదాం(16) అదృశ్యమైనట్లు తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తండ్రి యూసుఫ్ కథనం మేరకు.. ఈ నెల 27న ఉదయం స్థానిక గోపీ విహార్ వీధిలోని ఎలక్ట్రికల్ షాపులో పనిచేసేందుకు వెళ్లాడు. అనంతరం తిరిగి ఇంటికి రాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తండ్రి యూసుఫ్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

లారీలు ఢీకొని డ్రైవర్‌కు గాయాలు


నుజ్జుగా మారిన లారీ

చింతకొమ్మదిన్నె : కడప–రాయచోటి రహదారిలో గువ్వలచెరువు ఘాట్ నాలుగో మలుపు వద్ద నిలిచిన లారీని మరో లారీ ఢీకొనడంతో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. సీకేదిన్నె సీఐ శివశంకర్ నాయక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నా ఇల్లు నాకు ఇప్పించండి


జేసీకి ఫిర్యాదు చేసి బయటకు వస్తున్న బాధితురాలు షాహీద

రాయచోటి టౌన్ : నా ఇంటిలో అద్దెకు ఉంటూ హబీబ్ అనే వ్యక్తి తన పేరిట రిజిష్టర్ చేయించుకున్నాడని వికలాంగురాలు షాహీదా జేసీ ఫర్మాన్ అహమ్మద్ ఖాన్‌కు ఫిర్యాదు చేశారు. బాధితురాలి కథనం మేరకు.. సుండుపల్లె మండల కేంద్రంలో నివాసముండే షాహీద... తన ఇంటిని హబీబ్‌కు అద్దెకు ఇచ్చింది. ఇటీవల హబీబ్ తనకు తెలియకుండా ఆ ఇంటిని రిజిష్టర్ చేయించుకున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి ప్రయోజనం లేదని తెలిపారు. పూర్తిస్థాయి విచారణ సాగించి తనకు న్యాయం చేయాలని కోరారు.

ఐరన్ షీట్లు పడి యువకుడికి గాయాలు

మదనపల్లె : ఐరన్ షీట్లు మీద పడి యువకుడు తీవ్రంగా గాయపడిన సంఘటన శుక్రవారం మదనపల్లె పట్టణం కొండామారిపల్లె సత్యసాయి కాలనీలో జరిగింది. స్థానికుడు సయ్యద్ బాషా కుమారుడు గౌస్ బాషా(18) శుక్రవారం సాయంత్రం ఇంటి వద్ద ఐరన్‌షీట్లను కిందకు దించుతుండగా, ప్రమాదవశాత్తు మీద పడి తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు బాషాను మదనపల్లె ఆస్పత్రికి తరలించారు.

ఈ–సెట్ కౌన్సిలింగ్ షురూ

- ఈ నెల 30 వరకు ఫీజు చెల్లింపునకు అవకాశం
- ఆన్‌లైన్‌లోనే విద్యార్థుల ధ్రువపత్రాల పరిశీలన
- తప్పులుంటే కౌన్సిలింగ్ కేంద్రాలకు అభ్యర్థులు
- జులై 1నుంచి కళాశాలల ఎంపికకు వెబ్ కౌన్సిలింగ్

పాలిటెక్నిక్ అర్హతతో బీటెక్ ద్వితీయ సంవత్సరంలో ప్రవేశాలకు నిర్వహించిన ఈ–సెట్ ఫలితాలు ఇటీవల విడుదలయ్యాయి. ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు కౌన్సిలింగ్ ప్రక్రియ షురూ అయింది. సాంకేతిక విద్యాశాఖ మార్గదర్శకాల మేరకు అర్హత సాధించిన విద్యార్థులకు ఈ నెల 30వ తేదీ వరకు ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు, రిజిస్ట్రేషన ప్రక్రియ ఆరంభమవుతుంది. జులై 8న సీట్లను కేటాయిస్తారు.


హెల్ప్‌లైన్ కేంద్రంగా ఏర్పాటు చేసిన కడప ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల

కడప ఎడ్యుకేషన్ : జిల్లాలో ఈ సెట్ ఫలితాల విడుదలతో కౌన్సిలింగ్ ప్రక్రియ మొదలవుతుంది. ఈసెట్ ర్యాంకు సాధించిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి హాల్ టికెట్, జనన తేదీ వివరాలతో ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.1200, ఎస్సీ, ఎస్టీలైతే రూ.600 చొప్పున ప్రాసెసింగ్ ఫీజు ఆన్‌లైన్ పేమెంట్ గేట్ వే ద్వారా చెల్లించాలి. ర్యాంకు సాధించిన విద్యార్థులు హెల్ప్‌లైన్ కేంద్రాలకు విధిగా వెళ్లాల్సిన అవసరం లేదు. అనంతరం పేమెంట్ రసీదు, పదో తరగతి, పాలిటెక్నిక్ మార్కుల జాబితాలు, కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు సమర్పించిన తర్వాత కేంద్రాలలో జులై 3న వెబ్ ఆధారిత విధానంలో పరిశీలిస్తారు. జులై 1 నుంచి 4వతేదీ వరకు ఆన్‌లైన్‌లో వెబ్‌కౌన్సిలింగ్ నిర్వహిస్తారు. ఆపై కళాశాలల ఎంపికకు ఆప్షన్లు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. 5న మార్పులు చేసుకునే అవకాశం ఉంటుంది. 8న సీట్లు కేటాయిస్తారు.

వెబ్ ఆప్షన్ల నమోదు

రిజిస్ట్రేషన్ సమయంలో హాల్ టికెట్ నెంబర్, జనన తేదీ వివరాలు సమర్పించిన విద్యార్థులకు ధ్రువపత్రాల వివరాలు కంప్యూటర్ స్క్రీన్‌పై కనిపిస్తాయి. ఆన్‌లైన్‌లో ధ్రువపత్రాల పరిశీలన పూర్తయినట్లు .. కంప్యూటర్ స్క్రీన్‌పై కనిపిస్తే విద్యార్థులు షెడ్యూల్ ప్రకారం నేరుగా వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలి. క్యాండిడేట్ ఈజ్ నాట్ ఎలిజబుల్ ఫర్ ఎక్సర్‌సైజ్ ఆప్షన్ అని అసంపూర్తిగా ఉన్న వాటిని గమనించి విద్యార్థులు హెల్ప్‌లైన్ కేంద్రంలో పరిశీలనకు హాజరు కావాల్సి ఉంటుంది. సర్టిఫికెట్ వెరిఫికేషన్ పురోగతిలో ఉన్నట్లు స్క్రీన్‌పై కనిపిస్తే విద్యార్థులు వెబ్ ఆప్షన్ల నమోదుకు సిద్ధమవుతారు. వైఎస్సార్ జిల్లాకు సంబంధించిన విద్యార్థులకు అనువుగా ఉండేందుకు కడప ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలను హెల్ప్‌లై న్ కేంద్రంగా ఏర్పాటుచేశారు.

ఆన్‌లైన్‌లో సమస్య ఉంటే కేంద్రానికి రావాలి



అభ్యర్థులకు సంబంధించి ఆన్‌లైన్‌లో ఏదైనా సాంకేతిక సమస్య ఏర్పడి ధ్రువపత్రాల పరిశీలన అసంపూర్తిగా ఉంటే మాత్రమే కడప మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ కేంద్రానికి హాజరు కావాలి. అది కూడా అభ్యర్థికి సంబంధించిన అన్ని ధ్రువపత్రాలతో రావాలి. ఏ సమస్య లేకుంటే మాత్రం ఆన్‌లైన్‌లోనే పత్రాల పరిశీలన చేస్తారు.

– సీహెచ్. జ్యోతి, ఈ–సెట్ కౌన్సిలింగ్ కో ఆర్డినేటర్

వ్యవసాయాధారిత ఉత్పత్తులతో మెరుగైన జీవనం

కేవీకే సమన్వయకర్త డాక్టర్ వీరయ్య


మాట్లాడుతున్న కేవీకే పోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య

కడప అగ్రికల్చర్ : వ్యవసాయాధారిత ఉత్పత్తులతో ఆదాయం పెరిగి మెరుగైన జీవనం సాగించవచ్చునని కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ వీరయ్య అన్నారు. భారతీయ వ్యవసాయ నైపుణ్య మండలి ఆధ్వర్యంలో ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రంలో వ్యవసాయంలో నైపుణ్య శిక్షణ రెండో రోజునా కొనసాగింది. డాక్టర్ వీరయ్య మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉండే పశువుల పేడ, పంట వ్యర్థాలు ఉపయోగించి తయారుచేసిన వానపాము ఎరువును సేంద్రియ ఎరువుగా ఉపయోగించుకోవచ్చన్నారు. సేద్య విభాగ శాస్త్రవేత్త డాక్టర్ సాయి మహేశ్వరి వానపాముల ఎరువు తయారీలో తెలుసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రయోగాత్మకంగా రైతులకు తెలిపారు. వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకులు గిరీష్ కుమార్ వివిధ కంపోస్టింగ్ పద్ధతుల గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు స్వామి, ప్రశాంతి, శిల్పకళ, మానస, సురేష్‌కుమార్ రెడ్డి, ప్రదీప్, మమత, తదితరులు పాల్గొన్నారు.

వనిపెంట కేవీకేకు పురస్కారం


అవార్డు అందుకుంటున్న డాక్టర్ బాలకృష్ణ

మైదుకూరు : వివిధ ప్రాంతాల్లో కేవీకే నిర్వహించిన కార్యక్రమాలు, రైతులు చిరుధాన్యాలతో అధిక దిగుబడి సాధించడానికి కృషి చేసిన మైదుకూరు మండలం వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలకు ప్రశంసలు దక్కాయి. రాజమహేంద్రవరంలో ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకు జరిగిన అగ్రికల్చరల్ టెక్నాలజీ అప్లికేషన్ రీసర్చ్ ఇన్‌స్టిట్యూట్(ఏటీఏఆర్ఐ) జోనల్ వార్షిక సమీక్ష సమావేశాల్లో ఆయా కేవీకేల్లో చేసిన కృషి ఆధారంగా అవార్డుల ఎంపిక జరిగింది. చిరుధాన్యాల ప్రోత్సాహానికి గుర్తింపుగా ఒక అవార్డు, వార్షిక నివేదిక విభాగంలో ఉత్తమ బాక్స్ అవార్డు వనిపెంట కేవీకేకు దక్కాయి. ఏటీఏఆర్ఐ డైరెక్టర్ షేక్ ఎన్.మీరా, జాతీయ నూనె గింజల పరిశోధన సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ మాధుర్, డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వ విద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ కరుణశ్రీ చేతుల మీదుగా శుక్రవారం అవార్డులు అందుకున్నారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు శ్రీవిద్యారాణి, బీఎస్ కాంతిశ్రీ, ఫిరోజ్ హుస్సేన్‌లకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

వాణిజ్య బ్యాంకులకు దీటుగా సేవలు

బ్యాంకు ఇన్‌చార్జి సీఈఓ రాజామణి



కడప అగ్రికల్చర్ : వాణిజ్య బ్యాంకులకు దీటుగా డీసీసీ బ్యాంకు సేవలందిస్తోందని, రాజకీయ ప్రమేయం లేకుండా అందరికీ రుణం ఇస్తున్నామని డీసీసీ బ్యాంకు ఇన్‌చార్జి సీఈఓ రాజామణి పేర్కొన్నారు. కడప డీసీసీ బ్యాంకు చాంబర్‌లో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ రైతులు, చేతివృత్తులు, స్వయం సంఘాల వినియోగదారులకు సకాలంలో రుణాలు ఇస్తున్నామని తెలిపారు. తనఖా భూములను క్షేత్రస్థాయిలో సిబ్బంది పరిశీలించి రిజిస్ట్రార్ విలువ ప్రకారం రుణాలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. సహకారం చట్టం 1964 ప్రకారం తనఖా భూమిని వేలం వేసి బకాయిలు రాబడతామని తెలిపారు. జిల్లాలో నాలుగు బ్రాంచ్‌లతోపాటు మొబైల్ బ్యాంకింగ్ సర్వీసు మంజూరు చేశారన్నారు. 2021–22 సంవత్సరానికి డీసీసీ బ్యాంకుకు ఉత్తమ అవార్డు దక్కిందన్నారు. మూడు, నాలుగేళ్ల కిందట రూ.300 కోట్లు డిపాజిట్ ఉండగా, నేడు రూ. 513 కోట్లు పెరిగిందని తెలిపారు. విలేకరుల సమావేశంలో డీజీఎంలు వేంకటేశ్వర్లు, ప్రతాప్‌రెడ్డి, ఏజీఎంలు రాజేంద్రకుమార్, వీరబ్రహ్మం, సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీలు.. కుడా పరిధిలో వద్దు


మాట్లాడుతున్న ఐదవ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ మెంబర్ సెక్రటరి డాక్టర్ కేవీ.రమణారెడ్డి

కడప సెవెన్‌రోడ్స్ : కడప అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధి నుంచి గ్రామ పంచాయతీలను తప్పించాలని వైఎస్సార్ జిల్లా సర్పంచులు ఐదో రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ అధికారులను కోరారు. రానున్న ఐదేళ్ల కాలంలో రాష్ట్ర కన్సాలిడేటెడ్ ఫండ్ నుంచి స్థానిక సంస్థలకు ఇవ్వాల్సిన నిధులపై అంచనాలు తయారు చేసేందుకు ఫైనాన్స్ కమిషన్ మెంబర్‌సెక్రటరి డాక్టర్ కేవీ రమణారెడ్డి, సభ్యులు పద్మారావు, కృపారావు, ప్రసాదరావు శుక్రవారం కడప నగరానికి వచ్చారు. జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన స్థానిక జెడ్పీ ఆవరణలోని డీపీఆర్‌సీ భవనంలో జరిగిన సమావేశంలో కమిషన్ సభ్యులు పంచాయతీలలో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు కొనిరెడ్డి శివచంద్రారెడ్డి మాట్లాడుతూ 300 చదరపు మీటర్లు దాటితే రెసిడెన్షియల్ బిల్డింగ్ ప్లాన్ అప్రూవల్ కుడా పరిధిలోకి వస్తుండడంతో పంచాయతీలకు రావాల్సిన వాటా చెల్లించలేదని చెప్పారు. కుడా అధికారులు సర్పంచులను సంప్రదించకుండా వెంచర్లు వేసిన వారితో లాలూచీ పడుతున్నారని ఆరోపించారు. 30 ఏళ్ల కిందట నాలుగు రూపాయల తలసరి గ్రాంట్ వంద రూపాయలకు పెంచారని, పదేళ్లుగా స్టేట్ ఫైనాన్స్ నిధులు రావడం లేదని తెలిపారు. ఇంటి పన్నును మూడేళ్లకోసారి రివిజన్ చేయాలని, ఉపాధి హామీ మెటీరియల్ కాంపోనెంట్ వెంటనే చెల్లించాలని విన్నవించారు. పోరుమామిళ్ల సర్పంచ్ సుధాకర్ మాట్లాడుతూ ప్లాన్ అప్రూవల్స్‌ను కుడా పరిధి నుంచి తప్పించి పంచాయతీలకే కల్పించాలన్నారు. స్టాంప్ డ్యూటీ ఇవ్వడం లేదని తెలిపారు. అనంతరం కమిషన్ సభ్యులు మాట్లాడుతూ సర్పంచుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామన్నారు. వసూళ్లవుతున్న ఆదాయంలో ఖర్చులుపోనూ మిగిలిన సొమ్ము స్థానిక సంస్థలకే అందేలా చూస్తామన్నారు. గ్రామ పంచాయతీలలో ఆర్థిక వనరుల అభివృద్ధితోపాటు, జవాబుదారీతనం పెరగాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి, డీపీఓ కార్యాలయ ఏఓ ఖాదర్ బాష తదితరులు పాల్గొన్నారు.

రైతాంగ సమస్యలపై అఖిలపక్ష సమావేశం


విలేకరులతో మాట్లాడుతున్న ఈశ్వరయ్య, తదితరులు

కడప వైఎస్సార్ సర్కిల్ : రాష్ట్రంలో రైతుల సమస్యలను పరిష్కరించేందుకు అఖిలపక్ష నాయకులతో సమావేశం ఏర్పాటుచేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, యంత్రాలు, వ్యవసాయ రుణాల అంశాలపై అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏటా నకిలీ విత్తనాల బారిన పడి రైతులు భారీగా నష్టపోతున్నారని, రైతు భరోసా కేంద్రాలను పూర్తిస్థాయిలో అమలులోకి తీసుకురావాలని కోరారు. పోలవరం ప్రాజెక్టు పర్యవేక్షణకు సమయాన్ని కేటాయించిన ముఖ్యమంత్రి.. కరవు, వలసలు, ఆత్మహత్యలకు నిలయంగా మారిన రాయలసీమ ప్రాజెక్టులపై దృష్టి పెట్టాలని సూచించారు. ప్రొద్దుటూరు పాలకేంద్రం, చెన్నూరు చక్కెర ఫ్యాక్టరీ నిర్మాణానికి శ్రీకారం చుట్టి చేయూతనివ్వాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు యువి.సుబ్బారెడ్డి, మనోహర్‌రెడ్డి, కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

లింగప్పకుంట ఆక్రమణ


ఆక్రమణకు గురవుతున్న లింగప్ప కుంట

సంబేపల్లె : మండలంలోని నారాయణరెడ్డిపల్లె పరిధిలోని ముదినేనివాండ్లపల్లె సమీపంలో లింగప్పకుంట ఆక్రమణకు గురవుతోందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. గ్రామంలోని సర్వే నెంబర్ 404లో 20 ఎకరాల్లో కుంట ఉండేది. అయితే తరచూ కుంట ఆక్రమణ జరుగుతుండడంతో క్రమంగా నీటి నిల్వ విస్తీర్ణం తగ్గిపోతుందని గ్రామస్థులు వాపోతున్నారు. అధికారులు చర్యలు తీసుకొని ఆక్రమణ అడ్డుకోవాలని వారు కోరుతున్నారు.

సారా విక్రయిస్తున్న మహిళ అరెస్ట్

మదనపల్లె : సారా విక్రయిస్తున్న మహిళను అరెస్టు చేసినట్లు తాలూకా సీఐ ఎస్.శేఖర్ తెలిపారు. కొత్త ఇండ్లకు చెందిన మునెమ్మ(32) సారా విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో తనిఖీలు చేసినట్లు సీఐ తెలిపారు. ఆమె వద్ద 17 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేశామన్నారు. పీడీ యాక్ట్ కింద కేసు నమోదుచేసినట్లు తెలిపారు.

బాలింత ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : మూడో కాన్పులోనూ ఆడపిల్ల పుట్టడంతో మనస్తాపం చెందిన ఓ బాలింత ఆత్మహత్యకు యత్నించిన సంఘటన పుంగనూరు మండలం కృష్ణాపురంలో శుక్రవారం జరిగింది. స్థానికుడు రమేష్ కుమార్తె స్వాతి(25)ను కదిరి ఉస్తికాయలపల్లెకు చెందిన నరసింహులుకు ఇచ్చి వివాహం చేశారు. వీరికి ఇప్పటికే ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు. మూడోకాన్పు నిమిత్తం స్వాతి పుట్టినిల్లు అయిన కృష్ణాపురానికి వచ్చింది. నెల రోజుల క్రితం ఆడపిల్లకు జన్మనిచ్చి కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్స చేసుకుంది. అయితే..ముగ్గురు ఆడపిల్లలు కావడంతో అత్తింటి నుంచి వేధింపులుంటాయనే మనస్తాపంతో ఇంటివద్దే పురుగుమందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. కుటుంబసభ్యులు వెంటనే మదనపల్లె ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు.

గాలివీడు విద్యార్థికి 4వ ర్యాంకు


విద్యార్థి ముజఫర్ హుసేన్ (ఫైల్)

గాలివీడు : ఏపీ పీజీసెట్ పరీక్ష ఫలితాలలో గాలివీడు విద్యార్థి ముజఫర్ హుసేన్ 4వ ర్యాంక్ సాధించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మండల కేంద్రంలోని పెద్దూరులో నివాసముంటున్న షేక్ మహమ్మద్ కుమారుడు ముజఫర్ హుసేన్ ప్రతిభ కనబరచి ఉర్దూ విభాగంలో మెరుగైన ర్యాంకు సాధించినట్లు తెలిపారు. తల్లిదండ్రులు కూలి పనులు చేస్తూ తన చదువులకు ప్రోత్సాహం కల్పించడంతో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారన్నారు. అనంతరం ఎస్వీ యూనివర్సిటీలో ఎంఏ ఉర్దూ పూర్తిచేసి యూపీఎస్సీ ద్వారా ఉద్యోగం సాధించాలన్నదే తన ఆశయం అని స్పష్టం చేశారు.

ఎర్రచందనం దుంగలు స్వాధీనం


ఎర్ర చందనం స్వాధీనం చేసుకున్న అటవీ అధికారులు

పీలేరు : కారుతో సహా రూ.7 లక్షల విలువైన ఎర్ర చందనం దుంగలు స్వాధీనం చేసుకున్నట్లు పీలేరు ఎఫ్ఆర్‌వో రామ్లానాయక్ తెలిపారు. అటవీ అధికారుల వివరాల మేరకు.. స్థానిక యల్లమంద – ఉస్తికాయల పెంట మార్గంలో బొమ్మాజీ కనుమ వద్ద గురువారం నిఘా ఏర్పాటు చేశారు. బొలెరో పికప్ వాహనం రావడంతో ఫారెస్ట్ సిబ్బంది ఆపగా దుండగులు వాహనాన్ని ఆపి పరారయ్యారు. పరిశీలించగా 658 కిలోల బరువు గల 20 ఎర్రచందనం దుంగలున్నట్లు గుర్తించారు. ఈ దాడిలో ఎఫ్ఆర్‌వోలు సబియా సుల్తానా, జగదీష్, చంద్రకళ పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి బజాజ్ ఎలక్ట్రిక్ ఆటోలు

కడప కార్పొరేషన్ : బజాజ్ ఎలక్ట్రిక్ ఆటోలు కడప మార్కెట్‌లో శుక్రవారం విడుదలయ్యాయి. స్థానిక వినాయకనగర్‌లోని హరూన్ ఆటో మోటివ్స్ షోరూంలో కడప మేయర్ కె.సురేష్ బాబు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి నూతన బజాజ్ ఎలక్ట్రిక్ ప్యాసింజర్, కార్గో మోడళ్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి చార్జ్‌కు ఇవి అత్యుత్తమ మైలేజీ ఇస్తాయన్నారు. ఒకసారి చార్జ్ చేస్తే 183కి.మీ మైలేజీ ఇస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బజాజ్ కంపెనీ ప్రతినిధులు కార్తికేయన్, చంద్రశేఖర్, హరూన్ ఆటో మోటివ్స్ మేనేజింగ్ డైరెక్టర్స్ ఎస్‌బి.అహ్మద్‌బాషా, ఆసిఫ్ బాషా, వైఎస్సార్‌సీపీ నాయకులు జమాల్‌వలి, హరూన్‌బాబు, మియ్యా, అజ్మతుల్లా పాల్గొన్నారు.

అక్రమ కేసులు ఎత్తివేయాలని వినతి

కడప సెవెన్‌రోడ్స్ : ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్. సూర్యనారాయణపై నమోదు చేసిన అక్రమ కేసులను సత్వరమే ఉపసంహరించుకోవాలని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్‌కుమార్ డిమాండ్ చేశారు. నగరంలోని ఏపీజీఈఏ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి కలెక్టర్‌కు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా రమేష్‌కుమార్ మాట్లాడుతూ కొంతకాలంగా రాష్ట్రంలో ఐఏఎస్‌ల నుంచి ఆఫీస్ సబార్డినేట్ వరకు రావాల్సిన ప్రయోజనాలు అందకపోగా, పనిభారం పెరిగిందని తెలిపారు. ఉద్యోగుల కుటుంబాన్ని ఆదుకోవడానికి వచ్చిన సూర్యనారాయణను ఇబ్బందులకు గురిచేయడం తగదన్నారు. అతడిపై పెట్టిన అక్రమ కేసులను బేషరతుగా ఎత్తివేయాలన్నారు. రఘురామనాయుడు, కార్యదర్శి సుదర్శన్ రెడ్డి, ట్రెజరర్ చంద్రశేఖర్, ఉద్యోగులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వీఆర్ఏకు గాయాలు


చికిత్స పొందుతున్న వెంకటరమణ

రాజంపేట : కడప–రేణిగుంట జాతీయ రహదారిలోని న్యూ బోయనపల్లె(రాజంపేట మండల) వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మందపల్లె వీఆర్ఏ వెంకటరమణ తలకు తీవ్ర గాయమైంది. మెరుగైన చికిత్స కోసం తమిళనాడులోని వేలూరుకు తరలించారు. ఆపరేషన్‌కు అవసరమైయ్యే డబ్బులు తమ వద్ద లేవని కుటుంబీకులు ఆవేదన వ్యక్తం చేశారు. రమణ ఆపరేషన్‌కు అవసరమైయ్యే ఖర్చు నిమిత్తం సాయం చేయాలని కోరారు.

నిర్మాణంలో అక్రమాలు జరగలేదు

రాయచోటి టౌన్: ఆలయ గదుల నిర్మాణంలో ఎలాంటి అక్రమాలు జరగలేదని ఆలయ ఈవో డి.వి.రమణారెడ్డి తెలిపారు. శుక్రవారం రాత్రి విలేకరులతో ఆయన మాట్లాడుతూ వీరభద్ర స్వామి ఆలయ మాన్యం 15 సెంట్ల స్థలంలో రూ.9.45 కోట్ల నిధులతో 92 గదులు నిర్మించేందుకు టెండర్లు వేశామని చెప్పారు. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ భవన నిర్మాణాలు ప్రారంభించారని పేర్కొన్నారు. ఇప్పటి వరకు రూ.2,45,40,000ల నిధులు దాతల నుంచి సేకరించామని, గతంలో చైర్మన్‌గా ఉన్న పోలంరెడ్డి విజయమ్మ తన సొంత నిధులు ఖర్చుచేసి తరువాత దాతల నుంచి వచ్చిన సొమ్ము తీసుకున్నట్లు తెలిపారు. ఇదంతా రికార్డు పరంగానే ఉన్నాయని తెలిపారు. హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్టు సభ్యుడు ఎస్.సుజన్ కుమార్ రూ.2.70 కోట్ల అక్రమాలకు పాల్పడినట్లు దేవాదాయశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారన్నారు. ఇప్పటి వరకు ఖర్చు చేసింది రూ.2.50 కోట్లు మాత్రమే అన్నారు. ఫిర్యాదు నిరాధారమైందని, ఈ ఆరోపణలు చేయడంతో ఆలయ ప్రతిష్ట దెబ్బతిందన్నారు. సదరు వ్యక్తిపై పరువు నష్టం దావా వేస్తామని చెప్పారు. ఇక్కడ ఎలాంటి అవినీతి జరగలేదని తేల్చిచెప్పారు.

కట్టుకున్న భర్తే కాలయముడు!

- మరొకరితో సన్నిహితంగా ఉందనే కక్షతోనే హత్య
- వివాహిత హత్య కేసులో కొలిక్కి వచ్చిన దర్యాప్తు
- సంఘటనా స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ ప్రసాదరెడ్డి


హత్యకు గురైన వివాహిత భారతి(ఫైల్)


నిందితుడు గణపతి (ఫైల్)

నిమ్మనపల్లె : భార్య మరొకరితో సన్నిహితంగా ఉందనే అనుమానంతో కక్ష పెంచుకున్న భర్తే భార్య పాలిట కాలయముడయ్యాడని పోలీసులు భావిస్తున్నారు. గురువారం రాత్రి వివాహిత గొంతుకోసి క్రూరంగా చంపిన నిందితుడు వినియోగించిన ద్విచక్ర వాహనం, మృతురాలి ఫోన్ ఆధారంగా పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. మృతురాలి తల్లి సాలమ్మ ఫిర్యాదు మేరకు కేసు వివరాలిలా ఉన్నాయి. నెల్లూరు పట్టణం కొవ్వూరు నాగులగుట్ట గ్రామానికి చెందిన సాలమ్మ, రంగయ్య దంపతుల కుమార్తె పి.భారతి(25)ని తొమ్మిదేళ్ల కిందట చిత్తూరు జిల్లా పలమనేరు పట్టణం నాలుగురాళ్ల వీధికి చెందిన పూల వ్యాపారి గౌరమ్మ కుమారుడు గణపతి(32)కి ఇచ్చి వివాహం చేశారు. గణపతి లారీ క్లీనర్ పనులు చేస్తూ జీవిస్తున్నారు. వీరికి రోహిత(4), గంగాధర(6) సంతానం. కొద్ది రోజులు సజావుగా కాపురం సాగినా.. గణపతి జులాయిగా మారి కుటుంబాన్ని నిర్లక్ష్యం చేయడంతో భార్యా,భర్తల మధ్య గొడవలు తలెత్తాయి. అత్తింటిలో ఆడపడుచుల వేధింపులు అధికం కావడంతో ఏడాది కిందట భారతి తల్లి వద్దకు వెళ్లింది. పిల్లలు గణపతి వద్దే ఉండడం.. డబ్బు ఇవ్వకపోతే పిల్లలను చంపేస్తానని బెదిరించడంతో.. భారతి తన తల్లిని అడిగి దాదాపు రూ.2 లక్షలు ఇచ్చింది. ఇటీవల చిత్తూరు జిల్లా పెనుమూరు మండలం కార్తికేయపురంలోని పుట్టినింటికి వెళ్లిన భారతి నెల్లూరు జిల్లా కొవ్వూరుకు చెందిన రవితో సన్నిహితంగా ఉంటుందనే అనుమానంతో గణపతి తన భార్యపై కక్ష పెంచుకున్నాడు. పిల్లలు మదనపల్లెలో ఉన్నారు.. వస్తే నీతో పంపిస్తా అన్ని చెప్పడంతో భారతి నెల్లూరు నుంచి గురువారం చౌడేపల్లికి వచ్చింది. సాయంత్రం భార్యా, భర్తలిద్దరూ ద్విచక్ర వాహనంలో నిమ్మనపల్లి మండలం దివిటివారిపల్లె సమీపంలోని పొలాల వద్దకు వెళ్లారు. పథకం ప్రకారం గణపతి క్రూరంగా ఆమె గొంతు కోసి హత్య చేశాడు. ఇదే సమయంలో పంటకు నీరు పెట్టేందుకు వచ్చిన మంజునాథ అలియాస్ రామాంజులు(30) అక్కడికి వెళ్లడం... ఆయనపైనా కత్తితో దాడి చేయడం జరిగిపోయింది.

నిందితుడి కోసం గాలింపు – డీఎస్పీ ప్రసాదరెడ్డి

వివాహిత హత్య కేసు నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు డీఎస్పీ ప్రసాద్ రెడ్డి తెలిపారు. శుక్రవారం హత్య జరిగిన స్థలాన్ని సీఐలతో కలిసి పరిశీలించారు. క్లూస్ టీం డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ నిందితుడు తప్పించుకునే క్రమంలో గొల్లపల్లి వద్ద ద్విచక్ర వాహనాన్ని వదలివెళ్లినట్లు తెలిపారు. త్వరలో అతడిని అరెస్టు చేస్తామన్నారు. ఎద్దురుడు, యువరాజు, వలీబాషు, చంద్రశేఖర్, మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.